VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ బుధవారం 19 జూన్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 320



2లో

విద్యార్థుల ఆందోళనలపై స్పందించాలి

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

## గుత్తాపై గుర్రుగా ఉన్న గులబీ బాస్

మండలి ఛైర్మన్‌గా గుత్తాను తొలగించే ఎత్తులు

మండలిలో పట్టు సాధించేందుకు కాంగ్రెస్ పై ఎత్తులు



2లో

## కెసిఆర్‌పై, బిఆర్ఎస్‌పై బురదజల్లే యత్నం

విచారణల పేరుతో పాలన పక్కదారి

కెసిఆర్‌ను అరెస్ట్ చేయించే తొందరలో బిజెపి

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి

# ఐటిఐలను ఐటిసిలుగా మార్పు

ఐటిఐలలో ఇక ఆధునిక శిక్షణ

టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో పదేళ్లకు ఒప్పందం

విద్యార్థుల్లో ఆధునిక నైపుణ్యాలను కల్పించే లక్ష్యం

సిఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

మల్లేపల్లి ఐటిఐ అధునీకరణ కేంద్రానికి శంకుస్థాపన



**హైదరాబాద్:** ప్రస్తుతం ఐటీఐల్లో విద్యార్థులకు నేర్పించే నైపుణ్యాలు ఉపయోగం లేకుండా పోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. 50 ఏళ్ల నాటి నైపుణ్యాలను ఐటీఐల్లో నేర్పిస్తున్నారని, అప్ గ్రేడ్ కావాల్సిన అవసరం ఉందన్నారు. ఐటీఐలను ఐటీసీలుగా మారుస్తున్నామని ప్రకటించారు. ఇందుకోసం టాటా సంస్థ సహకారం తీసుకుంటున్నామని వెల్లడించారు. విద్యార్థులు, నిరుద్యోగులను నా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానని వివరించారు. తన ఆలోచనల నుంచి వచ్చిందే ఏటీసీ సెంటర్స్ అని పేర్కొన్నారు. మేం పాలకులు, మీరు బానిసలు అనే ఆలోచన లేదు. మేం సేవకులం అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 40 లక్షల మంది యువతీ యువకులు ఉపాధి లేక రిక్రూట్‌మెంట్ బోర్డుల చుట్టూ తిరుగుతున్నారు. సర్టిఫికెట్ ఉంటే సరిపోదు సాంకేతిక నైపుణ్యం ఉండాలి. సాంకేతిక నైపుణ్యం ఉంటే ఉపాధి లభిస్తుందని విశ్వసిస్తానని అన్నారు. సర్టిఫికెట్స్ జీవన ప్రమాణాలు పెంచవు. గల్ఫ్ దేశాలకు వలసలు వెళ్లకుండా ప్రభుత్వం ఉపాధి గ్యారంటీ ఇస్తుంది. టాటా సంస్థ సహకారంతో సాంకేతిక నైపుణ్యాల

మిగతా 2లో

## కొత్త సారథి వేటలో బిజెపి

తెరపైకి పులువురు నేతల పేర్లు

అసెంబ్లీ, పార్లమెంట్ గెలుపుతో సమర్థనేత కోసం చూపు



2లో



2లో

## తప్పు చేసిన పోలీసులకు శిక్ష తప్పదు

బిజెపి కార్యకర్తలకు రఘునందన్ పరామర్శ

## తప్పులను సమర్థించుకుంటున్న కెసిఆర్



2లో

విద్యుత్ కొనుగోళ్లో అక్రమాలను సమర్థించుకునే యత్నం

జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఎదుట కోదండరామ్ వివరణ

# అసలు రైతులను గుర్తించే పనిలో ప్రభుత్వం





పెద్దలు, పెత్తందార్లు, అధికారుల భూములకు నో

రుణమాఫీకి ముందే లెక్కతేల్చనున్న సర్వే

హైదరాబాద్: రైతుభరోసా మాదిరే రుతు రుణమాఫీకి కూడా విధివిధానాలు రాబోతున్నాయి. ఇందుకు పేదరికమే గీటురాయి కానుంది. అసలుసిసలు రైతులను గుర్తించబోతున్నారు. మోతుబరి రైతుల రుణాలను లెక్కలోకి తీసుకోవద్దన్న సూచనలు వచ్చాయి. దీంతో కేవతం వ్యవసాయం కోసం రుణాలు తీసుకున్న బక్కరైతులకే లబ్ది చేరూర్చేలా రుణమాఫీని చేయబోతునట్లు సమాచారం.

'పీఎం కిసాన్' పథకంలో ఉన్న నిబంధనలనూ రుణమాఫీలో అమలుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

దీనిపై దాదాపు తుది నిర్ణయానికి వచ్చినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది.దీని ప్రకారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఆదాయ పన్ను కడుతున్న వారికి రుణమాఫీ అందేందుకు అవకాశం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న రైతులు, మిగతా చిన్న ఉద్యోగస్తులు కూడా వివిధ అవసరాల నిమిత్తం ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేస్తున్నారన్న అంశం తెరమీదకు వచ్చింది. రిటర్నులు దాఖలు చేశారన్న కారణంతో ఆ రైతులను మాఫీ నుంచి మినహాయించే అవకాశాలు లేవని, ఆదాయ పన్ను కడుతున్న వారినే మినహాయించే ఆలోచన ఉందని తెలుస్తోంది. ఆ మేరకు ఐటీ రిటర్నులు దాఖలుచేస్తున్న చిన్న రైతులకు, చిన్న ఉద్యోగస్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ÷ఖటన్నింటిపై ఏంచేయాలనేదానిపై 4రోజుల్లో మంత్రివర్గ సమావేశం నిర్వహించి రుణమాఫీ అమలుకు తీసుకోవాల్సిన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేయనుంది. రైతులకు రుణమాఫీని తొలి ఏకాదశి, అంటే జూలై 17న మొదలుపెట్టనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. రుణమాఫీ ప్రక్రియను జూలైలోనే ప్రారంభిస్తే అప్పటికే వ్యవసాయ పనులు ముమ్మరమై పెట్టుబడి అవసరమైన రైతులకు మళ్లీ రుణం తీసుకునేందుకు అవకాశం కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. జూలైలో ప్రారంభించి ఆగస్టు వరకు మొత్తం 3 విడతల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధుల సమీకరణ కొలిక్కివస్తుండటంతో.. అన్నదాతలకు హామీనిచ్చిన ఆగస్టు 15 వరకు కాకుండా.. ఒక నెల ముందుగానే ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు పీఎం కిసాన్‌లో అమలుచేస్తున్న నిబంధనలను రుణమాఫీకి కూడా వర్తింపజేసినా ఈ పథకం కోసం రూ.25వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. రుణమాఫీకి అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు భూమి పాస్‌బుక్, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో పాటు బ్యాంకుల ఖాతాలను ప్రామాణికంగా తీసుకుంటారు. అదే విధంగా ఈ ప్రక్రియ మొత్తం పూర్తయ్యేవరకు రైతులకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే పరిష్కరించేందుకు వీలుగా ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్‌ను కూడా ఏర్పాటుచేయనున్నారు. ఈ క్రమంలో అసలు రైతులను కూడా గుర్తించి రికార్డులు నమోదు చేయనున్నారు. రుణాలను తీసుకుని ఏయే పంటలు వేశారన్నది కూడా లెక్కలోకి రానుంది.

# నీట్ ఆందోళనలపై ప్రధాని మౌనం

## మండిపడ్డ కాంగ్రెస్ ఎంపి రాహుల్



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా నీట్ పరీక్షపై విద్యార్థులు, విపక్షాలు ధర్నాలు చేస్తున్నా ప్రధాని ఎందుకు స్పందించట్లేదని కాంగ్రెస్ ఎంపి రాహుల్ ప్రశ్నించారు. నీట్ పరీక్ష విషయంలో మౌనం వహిస్తున్న ప్రధానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ తమ గళాన్ని వినిపిస్తుందన్నారు.ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై మంగళవారం విమర్శలు గుప్పించారు. పరీక్ష పేపర్ లీక్ (లకు వ్యతిరేకంగా బలమైన విధానాల రూపకల్పనకు పార్లమెంటు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. భాజపా? ఆ కూటమి పాలిత రాష్ట్రాలైన బిహార్, గుజరాత్, హరియాణాల్లో జరిగిన అరెస్టులు పరీక్షలో అవినీతి జరిగిందని రుజువు చేస్తున్నాయని చెప్పారు. నీట్ పరీక్షలో 24లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తు తారుమారు అయినా మోదీ ఏమీ పట్టనట్లుగా ఎప్పటిలాగే మౌనం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భాజపా పాలిత రాష్ట్రాలు పేపర్ లీక్‌కు కేంద్రంగా మారాయని మండిపడ్డారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేపర్ లీకేజీలు కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందన్న అంశాన్ని గుర్తు చేశారు.

2024 నీట్ పరీక్ష నిర్వహణలో ఎవరైనా 0.001 శాతం నిర్లక్ష్యం వహించినా క్షుణ్ణంగా పరిష్కరించాలని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. ఎన్‌టీఏ(ఔ÷ం) ఆల్ ఇండియా ప్రీ-మెడికల్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తుంది. మే 5న జరిగిన పరీక్షలో విద్యార్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులతో సహా ఫిర్యాదుదారులు లేవనెత్తిన రెండు వేర్వేరు పిటిషన్లను ధర్మాసనం విచారించింది.





# విద్యార్థుల ఆందోళనలపై స్పందించాలి

**న్యూఢిల్లీ:** వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ, అవకతవకలు జరిగాయంటూ వస్తోన్న వార్తలతో దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో వీటిని నిర్వహిస్తోన్న జాతీయ పరీక్ష మండలిపై భారత సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా మండిపడింది. ఎక్కడైనా 0.001 శాతం నిర్లక్ష్యం ఉన్నా.. దాన్ని సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేసింది. పరీక్ష నిర్వహిస్తున్న సంస్థగా.. న్యాయంగా వ్యవహరించాలి. ఏదైనా తప్పిదం జరిగితే.. తప్పు జరిగిందని అంగీకరించాలి. ఈ చర్యలు తీసుకోనున్నాం అని వివరించాలి. కనీసం అదైనా మీ పనితీరుపై విశ్వాసం కలిగిస్తుందని ఎన్టీఏకు సుప్రీం ధర్మాసనం పేర్కొంది. దేశంలోనే అత్యంత కఠినమైన పరీక్షకు సిద్ధమయ్యేందుకు విద్యార్థులు పడే శ్రమను మరిచిపోకూడదని తెలిపింది. వ్యవస్థను మోసం చేసే వ్యక్తి వైద్యుడైతే.. సమాజానికి ఎంత హానికరమో ఆలోచించాలని వ్యాఖ్యానించింది. ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ విక్రమనాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీలతో కూడిన వెకేషన్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. ఎన్టీఏ నుంచి సకాలంలో చర్యలు ఆశిస్తున్నామన్న ధర్మాసనం.. తదుపరి విచారణను జులై 8న చేపడతామని తెలిపింది. అంతకుముందు ఇదే అంశంపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. నీట్-యూజీ (2024) పరీక్ష పవిత్రతకు విఘాతం కలిగిందని వ్యాఖ్యానించింది. దీనికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్‌టీఏపైనే ఉందని తెలిపింది. ప్రశ్నపత్రం లీకేజీ, ఇతరత్రా అక్రమాలు జరిగినందున ఈ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లకు సమాధానం ఇవ్వాలని కేంద్రం, ఎన్‌టీఏలను ఆదేశించింది. అయితే, ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియను నిలిపివేసేందుకు మాత్రం నిరాకరించిన సంగతి తెలిసిందే.

# ఐటిఐలను ఐటిసిలుగా మార్పు

కోసం రూ.2,324 కోట్లతో 65 ఐటీఐలు ఐటీసీలుగా మారుస్తున్నాం. విద్యార్థుల శిక్షణ కోసం ముందుకు వచ్చిన టాటా యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఐటీ రంగంలో ప్రపంచంలో తెలుగు వారు పోటీ పడుతున్నారు. మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించడమే మా బాధ్యతని అన్నారు. రాష్ట్రంలో గల 65 ఐటీఐలను అధునాతనంగా తీర్చిదిద్దుతాం. నైపుణ్యాలను నేర్పించి నిరుద్యోగులకు భరోసా కల్పిస్తాం. విద్యార్థిని విద్యార్థులు ఐటీఐల్లో చేరాలి. ఈ శాఖ తన వద్ద ఉంటుంది. నేనే స్వయంగా పర్యవేక్షిస్తా. ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తా అని' సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో ఐటీఐ స్కిల్ డెవలప్‌మెంట్ అప్ గ్రేడేషన్ ప్రాజెక్టుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టాటా టెక్నాలజీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా యువతను తీర్చిదిద్దేందుకుగానూ ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చాలని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో పదేళ్లకుగానూ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేస్తారు. ఆధునిక పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా ఏటీసీల్లో యువతకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఏటీసీల్లో అధునాతన సామగ్రి, సాంకేతికత ఏర్పాటు చేస్తారు. శిక్షణ ఇచ్చేందుకు



130 మంది నిపుణులను టీటీఎల్ నియమిస్తుంది. ఏటీసీల్లో ఏటా 15,860 మందికి ఆరు రకాల దీర్ఘ కాల (లాంగ్ టర్మ్) కోర్సుల్లో, 31,200 మందికి 23 రకాల స్వల్ప కాలిక కోర్సుల్లో శిక్షణ అందిస్తారు. గత పదేళ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది మాత్రమే శిక్షణ పొందారు. ఈ ఏటీసీలతో రానున్న పదేళ్లలో నాలుగు లక్షల

మంది శిక్షణ పొందుతారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చే ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.2,324.21 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.307.96 కోట్లు (13.26 శాతం) కాగా టీటీఎల్ వాటా రూ.2016.25 కోట్లు (86.74). ఏటీసీలు

కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా పని చేస్తాయి. అలాగే ఈ ఏటీసీలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమలకు సాంకేతిక కేంద్రాలుగానూ (టెక్నాలజీ హబ్) పని చేస్తాయి. ఏటీసీల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి టీటీఎల్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. ఏటీసీలు భవిష్యత్తులో తమ సేవలను పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందజేస్తాయని అధికారులు తెలిపారు.

# కొత్త సారథి వేటలో బిజెపి

**హైదరాబాద్:** తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడంతో బిజెపిలో ఉత్సాహం కనిపిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో మరింతగా విస్తరించాలని చూస్తోంది. పార్టీని బలంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్లేందుకు నాయకులను అన్వేషిస్తోంది. పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కేంద్రమంత్రిగా మరోమారు ప్రమాణం చేయడంతో ఆయన స్థానంలో మరొకరిని నియమించేం దుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా త్వరలోనే అధ్యక్ష పదవికి అభ్యర్థి ఎంపిక జరుగనుందని ప్రచారం సాగుతోంది. బిజెపి ప్రతి ఎన్నికల్లో ఓట్ల శాతంతో పాటు సీట్లను పెంచుకుంటూ రాష్ట్రంలో క్రమంగా బలపడుతోంది. రాష్ట్రంలో ప్రస్తుత అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డి, కేంద్ర కేబినెట్‌లోకి వెళ్లారు.

దీంతో రాష్ట్ర పార్టీకి కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయాల్సి ఉంది. తెలంగాణ బీజేపీ శ్రేణులను నడిపించబోయే కొత్త సారథి ఎవరు? రేసులో ఉన్న నేతల్లో ఎవరికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి? 2028లో తెలంగాణలో అధికారంలోకి రావాలనుకుంటున్న బీజేపీ.. దానిని సాధించే సత్తా ఉన్న సారథి కోసం వెదుకుతోంది. తెలంగాణలో కమల రథాన్ని ముందుకు దూకించి, అధికార పీఠం దిశగా దూసుకుపోయే సమర్థుల కోసం వేట ప్రారంభించింది. అలాగే బీజేపీ స్టేట్ చీఫ్ పోస్ట్ కోసం నేతల మధ్య పోటీ పెరిగింది. ఈ రేసులో పలువురు నేతలు పోటీ పడుతున్నారు. ప్రస్తుతానికి దక్షిణాదిలో బీజేపీ వేగంగా విస్తరిస్తున్న రాష్ట్రం.. తెలంగాణ. అందుకే ఈ రాష్ట్రంపై కమలం పార్టీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇప్పటివరకూ తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డి.. కేంద్ర మంత్రివర్గంలోకి వెళ్లిపోవడంతో.. కొత్త అధ్యక్షుడి నియామకంతో పాటు బూత్ స్థాయిలో సంస్థాగత మార్పులకు బీజేపీ సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడి రేసులో అధిష్ఠానం ముందు కొన్ని పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఈటల రాజేందర్, డీకే అరుణ రఘునందన్ రావు, ధర్మపురి అర్వింద్, రామచందర్ రావులు సహా పలువురు నేతలు రేసులో ఉన్నారు. వీళ్లలో ఎవరికి పగ్గాలు అప్పగిస్తే బాగుంటుందా అనే ఆలోచనలో కమలం పార్టీ ఉంది . మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్‌కు తెలంగాణ బీజేపీ పగ్గాలు దక్కడం ఖాయమని జోరుగా ప్రచారం సాగింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్, హుజూరాబాద్‌లో పోటీ చేసి పరాజయం పాలైన ఈటలకు మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా పార్టీ మరో అవకాశం ఇచ్చింది. ఎంపీగా గెలిచి ఢిల్లీ వెళ్లిన ఈటల.. కేంద్ర మంత్రి పదవి సైతం ఆశించారు. కానీ అది దక్కలేదు. అయితే ఈటలకు రాష్ట్ర పార్టీ బాధ్యతలు అప్పగించబోతున్నారని కొందరు చెప్పుకుంటోంది. ఈటలకు పార్టీ పగ్గాలు అప్పగిస్తే.. లోకల్ బాడీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటొచ్చని బీజేపీ అధిష్ఠానం భావిస్తోందని కూడా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ఆ దిశగా పార్టీ అధిష్ఠానం సంకేతాలు ఇచ్చినట్లు ఈటల వర్గీయులు చెబుతున్నారు.

# తప్పు చేసిన పోలీసులకు శిక్ష తప్పదు

**మెదక్:** బీఆర్ఎస్ నేతల మాటలు విని ఫోన్ ట్యాపింగ్‌లో పట్టుబడ్డ కొందరు పోలీసులు జైల్లో ఉన్నారని .. తప్పుడు పనులు చేసిన పోలీసులను కూడా అక్కడికే పంపుతామని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడ్డ వారు శిక్ష అనుభవించక తప్పదన్నారు. మెదక్‌లో ఇటీవల జరిగిన అల్లర్లలో అరెస్టై మెదక్ సబ్ జైల్లో ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను రఘునందన్ రావు పరామర్శించారు. రెండు రోజుల క్రితం జరిగిన మెదక్ ఘటనలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని తెలంగాణ డీజీపీ రవికుమార్ గుప్తాను డిమాండ్ చేశారు. ఐజీ రంగనాథ్ అత్యుత్సాహం చూపుతున్నారని వార్నింగ్ ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఏ గతి పట్టిందో మెదక్ పోలీసులకు అదే గతి పడుతుందని.. తాను ఎవరికి బయపడనని హెచ్చరించారు. హిందువులకు ఓ నీతి ..ముస్లింలకు ఓ నీతిలా పోలీసులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మహిళ ఏఎస్ఐను బూతులు తిట్టిన వారిపై కూడా ఏం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రెండు రోజులు తాను సంయమనం పాటించానని చెప్పారు. అరిఫ్ గాయపడి ఏ హాస్పిటల్లో ఉన్నారని ప్రశ్నించారు. అరిఫ్‌ను వెంటనే అరెస్టు చేయాలని.. చట్టాన్ని సమర్థంగా పనిచేయించాలని రఘునందన్ రావు కోరారు.

# తప్పులను సమర్థించుకుంటున్న కెసిఆర్

**హైదరాబాద్:** కేసీఆర్ చేసిన తప్పులను సమర్థించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం ఆరోపించారు. భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్లు, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంపై జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఎదుట ఆయన హాజరయ్యారు. హైదరాబాద్ లోని బీఆర్కే భవన్‌లోని కమిషన్ కార్యాలయానికి కోదండరాంతో పాటు విద్యుత్ శాఖ అధికారి రఘు వచ్చారు. వారిద్దరి నుంచి కమిషన్ వివరాలు అడిగి తెలుసుకుంది. ఛత్తీస్‌గఢ్ తో 2000 మెగావాట్లకు ఒప్పందం చేసుకుంటే 200 మెగావాట్లు కూడా రాలేదని కాంపిటేటివ్ బిడ్డింగ్ కు వెళ్లంటే రేట్లు తగ్గేవని.. ఎంవోయూ ద్వారా ముందుకెళ్లారని ఇది అనుమానించదగ్గదేనని కోదండరాం కమిషన్‌కు తెలిపినట్లుగా తెలుస్తోంది. ఛత్తీస్ గఢ్ తో కరెంట్ కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్లపై గతంలో అఫిడవిట్ వేశామని కోదండరాం మీడియాకు తెలిపారు. అందుకు సంబంధించిన ఆధారాలను కమిషన్ ముందు ఉంచామన్నారు. ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వం తన అధికారాన్ని ఉపయోగించాలన్నారు. అభివృద్ధి అంటే ఒకరిద్దరికి లాభం చేయడం కాదన్నారు. గత ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్ల ట్రాన్స్‌కో, జెన్‌కోలకు రూ.81 వేల కోట్ల అప్పులు అయ్యాయన్నారు. గత ఏడాది వరదలు వస్తే భద్రాద్రి ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. భవిష్యత్తులో గోదావరి వద్ద నీటి మట్టం పెరిగితే భద్రాద్రి ఎ÷-లాంటును కాపాడుకోగలమా? అని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వం నిర్ణయాల వల్ల సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు తలెత్తాయన్నారు.

# గుత్తాపై గుర్రుగా ఉన్న గులబీ బాస్

హైదరాబాద్: ఎన్నికల హడావిడి ముగియడంతో ఇక రాజకీయ ఎత్తులు,పైఎత్తులకు తెలరలేవనుంది. ఎవరు ఎటువైపు ఉంటారన్నది తేలనుంది. మొత్తంగా బిఆర్ఎస్ రాజకీయంగా భారీ మూల్యాన్ని చెల్లించుకుంటుందనడంలో సందేహం లేదు. మరో ఐదేళ్ల వరకు బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అప్పటి వరకు కేసులు, అవినీతి వ్యవహారాలతో బిఆర్ఎస్ మరింతగా మూల్యం చెల్లించుకో తప్పదు. ఈ క్రమంలో బిజెపి, అధికార కాంగ్రెస్‌ల మధ్యనే రాజకీయం నడవనుంది. అలాగే శాసన మండలిలో తమ బలాన్ని పెంచుకునేందుకు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు సన్నద్ధమవుతోందన్న ప్రచారం వినిపిస్తోంది. ఈ క్రమంలో మండలి ఛైర్మన్ గుత్తాపై బీఆర్ఎస్ పెట్టడం ద్వారా పట్టు సాధించాలని బిఆర్ఎస్ ప్రతివ్యూహాలు పన్నుతోంది. అవిశ్వాస తీర్మానం, దీన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ అనుసరించనున్న

వ్యూహాలు.. తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారనున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య పట్టు కోసం తెలంగాణ శాసన మండలి వేదికకానుందనడంలో సందేహం లేదు. ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ అధిష్టానం రెడీ అవుతోందని తెలుస్తోంది. ఇకపోతే మండలి ఛైర్మన్ గుత్తా సహా మెజార్టీ ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం కూడా ఉంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోల్చితే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగలడంతో మండలిలో పట్టుకు కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతున్నట్లు సమాచారం. అధికార కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉంటున్న శాసన మండలి ఛైర్మన్ గుత్తాకు వ్యతిరేకంగా అవిశ్వాసం నెగ్గితే రాజకీయంగా పైచేయి చాటుకోవచ్చని బీఆర్ఎస్ అధిష్టానం వ్యూహాలు పన్నుతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలోరాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవిశ్వాస తీర్మానాలతో స్థానిక సంస్థలను అన్నింటిని కైవసం చేసుకుం టోంది. అసెంబ్లీ ఎన్నికలు విజయ దుందుభీ మోగించిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా గట్టి పట్టునే సాధించింది. మరోవైపు బీఆర్ఎస్ కు ఒక్క సీటు కూడా రాకుండా కాంగ్రెస్ ఖంగు తినిపించింది. శాసనసభలో బలం లేకపోయినా.. పెద్దల సభ శాసనమండలిలో ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని




బిఆర్ఎస్ భావిస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్, బిజెపిల వైపు గోడ దూకేందుకు సిద్ధమవుతు న్నారనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉండడం, పార్లమెంట్ ఎన్నికల టైంలో సుఖేందర్ రెడ్డి కొడుకు అమిత్ రెడ్డి కాంగ్రెస్ చేరడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలవేళ బీఆర్ఎస్‌లోని గుత్తా అనుచరులు మొత్తం గంపగుత్తగా కాంగ్రెస్ చేరారు. తొలుత అమిత్ రెడ్డి నల్గొండ, భువనగిరి నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఆశించగా.. ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ మాజీ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ పెద్దలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుఖేందర్ రెడ్డి.. కేసీఆర్, బీఆర్ఎస్‌పై ఫైర్ అయ్యారు. కేసీఆర్ చెప్పుడు మాటలు వినడం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యామని ఎంపీ ఎన్నికల సమయంలో గుత్తా సుఖేందర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఈ పరిణామాల నేపథ్యంలో సుఖేందర్ రెడ్డిని ఛైర్మన్ పదవి నుంచి దింపాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌లో నెగ్గడం ద్వారా అధికార కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేయవచ్చునే చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో జరుగుతోంది. గుత్తాపై అవిశ్వాస తీర్మానంలో నెగ్గితే ఓ రకంగా రేవంత్ రెడ్డి దూకుడుకు చెక్ పెట్టినట్టేనని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి..

తెలంగాణ శాసన మండలిలో మొత్తం సభ్యుల సంఖ్య 40 కాగా, ప్రస్తుతం రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు మినహాయిస్తే ప్రస్తుతం మండలిలో 38 మంది ఎమ్మెల్సీలు ఉన్నారు. మండలి ఛైర్మన్ పదవి నుంచి దింపడానికి మొత్తం సభ్యుల్లో 2/3 వంతు మెజార్టీ ఉండాలి. ప్రస్తుతం 27 మంది సభ్యులు అవిశ్వాసానానికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీఆర్ఎస్ పక్షాన 31 మంది ఎమ్మెల్సీలు ఉన్నట్టు మండలి రికార్డులు చెప్తున్నాయి. కానీ దామోదర్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ ఎమ్మెల్సీగా గెలిచారు. ఛైర్మన్ సుఖేందర్ రెడ్డితో కలిపితే కాంగ్రెస్ సంఖ్య ఆరుకు పెరిగింది. వీరిని మినహాయిస్తే బీఆర్ఎస్ తరఫున 26 మంది ఉంటారు. ఎంఐఎంకు ఇద్దరు ఎమ్మెల్సీలు ఉండగా, బీజేపీకి ఒకరు ఉన్నారు. టీచర్ ఎమ్మెల్సీలు ఇద్దరు ఓటింగ్ కు దూరంగా ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి శాసనసభలో తిరుగులేని బలం ఉన్నా.. మండలిలో మాత్రం బీఆర్ఎస్ పార్టీదే పైచేయిగా ఉంది. పలు కీలక బిల్లుల ఆమోదం, ఇతర

అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అడ్డంకిగా మారే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ శాసనమండలిలో 'ఆపరేషన్ ఆకర్ష కు సిద్ధమవుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. రాష్ట్రం ఏర్పడినపుడు శాసనసభలో బీఆర్ఎస్ కు తిరుగులేని బలం ఉన్నా.. శాసన మండలిలో మాత్రం కాంగ్రెస్‌దే ఆధిపత్యం ఉండేది. అప్పట్లో..

అధికార బీఆర్ఎస్ మండలిలోని మెజారిటీ కాంగ్రెస్ ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకుంది. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నారన్న వార్తలు రావడంతో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. మండలి ఛైర్మన్ పై బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానం పెడితే ఆ పార్టీకి ఉన్న సంఖ్యా బలంతో తేలికగా నెగ్గుతుంది. సభలో బీఆర్ఎస్ ఆధిపత్యాన్ని గండి కొట్టేందుకు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష వైపు మొగ్గు చూపుతోంది. బీఆర్ఎస్ నుంచి 14 మంది ఎమ్మెల్సీలను చేర్చుకుంటే మండలిలో కాంగ్రెస్ సంఖ్యాబలం 20కి చేరుకుంటుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో బిఆర్ఎస్‌కు చెక్ పెట్టవచ్చని అనుకుంటున్నారు.


# కెసిఆర్‌పై, బిఆర్ఎస్‌పై బురదజల్లే యత్నం



హైదరాబాద్: గత ప్రభుత్వంపై నిందలు వేయడానికి, మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై బురద జల్లాలన్న స్వార్థ రాజకీయంతో విచారణ కమిషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మాజీ మంత్రి , ఎమ్మెల్యే జి .జగదీష్ రెడ్డి అన్నారు. పాలన పక్కన పెట్టి విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో జగదీష్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ... నాలుగు అంశాల్లో ఎక్కడా చిన్న తప్పు లేదని, ఒక్క రూపాయి కూడా నష్టం జరగలేదని అర్థమైందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా కమిషన్‌తో మీడియా సమావేశం పెట్టించి గతంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు మాట్లాడిన మాటలు చెప్పించారని అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ తెలివి తక్కువతనం, మూర్ఖత్వంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేయాలని బీజేపీకు తొందరగా ఉన్నట్లుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ వేరు కాదని... సీఎం రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కలిసి పని చేస్తున్నారని ఐదేళ్లుగా చెబుతున్నామని జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపే ప్రయత్నం చేశారు. కేసీఆర్ తన లేఖలో అన్ని అంశాలను స్పష్టంగా వివరించారు, ప్రజలకు అన్ని విషయాలు స్పష్టంగా అర్థమయ్యాయి. కమిషన్‌కు ఎలాంటి ముందస్తు అభిప్రాయాలు ఉండరాదు. దురదృష్టవశాత్తూ కమిషన్ తన ఉద్దేశాన్ని ముందే బయట పెట్టింది. వాస్తవానికి జస్టిస్ నరసింహారెడ్డి విచారణకు అంగీకరించి ఉండాల్సింది కాదు. కేసీఆర్ విషయంలో ఏమీ తేల్చలేమని చెప్పి... రాష్ట్ర ప్రభుత్వం మీడియాకు లీకులు ఇచ్చింది. ఛత్తీస్‌ఘడ్ ఒప్పందంతో రూ. 6000 కోట్ల నష్టం కాదు.. అంతకు మించి లాభం జరిగింది. లీకులను సమర్థించేలా కొందరితో ఈ రోజు మాట్లాడించారు. 17 వేల మిలియన్ యూనిట్లు తీసుకొని ఛత్తీస్‌ఘడ్‌కు రూ.7000 కోట్లు చెల్లిస్తే రూ.6000 కోట్ల దుర్వినియోగం ఎలా అవుతుంది?. ఛత్తీస్‌ఘడ్‌కు సరిపడా విద్యుత్ ఇవ్వకపోవడంతో ఎక్కువ ధరకు కొన్నారు. నష్టం జరిగిందని ఇప్పుడు అంటున్నారు. మరి ఛత్తీస్‌గడ్ ఒప్పందం లేకపోతే 17 వేల మిలియన్ యూనిట్లకు 17 వేల కోట్లు కట్టాల్సి వచ్చేదని జగదీష్ రెడ్డి తెలిపారు. ఉత్తర భారతం నుంచి కరెంట్ తీసుకోకుండా కేసీఆర్ ఫెయిల్ అయితే మళ్లీ సమైక్య రాష్ట్రంలో కలపాలన్నది వీరు కుట్ర. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలంటే... తెలంగాణ లేకుండా చేయాలి. తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు, పదవుల్లో ప్రతి అక్షరంలో కేసీఆర్ పేరు ఉంది. కేసీఆర్‌కు మసి పూయాలన్న చిల్లర ప్రయత్నం చేస్తున్నారు. దమ్ముంటే సీఎం రేవంత్ రెడ్డి,

మంత్రులు ఎందుకు మీడియా సమావేశం పెట్టి చెప్పలేదు?. దొంగలుగా చీకట్లో ముసుగులు వేసుకొని ఎందుకు వ్యవహరిస్తున్నారు. రూ. 6000 కోట్ల నష్టం అన్న కథనాల్లో ప్రతి అక్షరం అబద్దమే. అవినీతి జరిగితే రమణ్‌సింగ్, కాంగ్రెస్ సీఎంలకు ఇచ్చారా? నల్గొండ జిల్లాలో విద్యుత్ కేంద్రం ఎందుకు పెట్టారని ఎవరైనా ప్రశ్నిస్తే ఖబర్దార్. నల్గొండ జిల్లా తెలంగాణలో లేదా కోదండరాంకి నల్గొండ కనిపించడం లేదా నల్గొండ జిల్లా దద్దమ్మ నేతలు నాటి లాగే ఇప్పుడు కూడా నోరెత్తకుండా వ్యవహరిస్తున్నారు, ప్రజలు అన్నీ గమనిస్తున్నారు' అని జగదీష్ రెడ్డి మండిపడ్డారు. నాడు ఛత్తీస్‌గడ్ నుంచి రూ.3.90కి యూనిట్ విద్యుత్ కొనకముందు జజ్జర్ నుంచి రూ. 17 రూపాయలకు యూనిట్ విద్యుత్ కొనుగోలు చేసే వాళ్లం. టీజేఎస్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం సూటిగా సమాధానం చెప్పాలి, డొంక తిరుగుడుగా మాట్లాడొద్దు. దొంగలతో చేతులు కలిపి ఉన్న ఈర్ష్యను చాటుకుంటున్నారు. హైదరాబాద్‌లో గతంలో విద్యుత్ కోతలతో లక్షల జనరేటర్లతో వచ్చిన శబ్ద, వాయు

కాలుష్యం ఎంత? ఎంత మంది క్యాన్సర్ బారిన పడి ఉంటారు. మణుగూరు విద్యుత్‌తో హైదరాబాద్‌లో కోతలు పోయి జనరేటర్లు బంద్ కావడం వల్ల ఎంత మేలు జరిగిందో ప్రజలు ఆలోచించుకోవాలి. తమకు పెట్టిన ఖర్చు కంటే తక్కువ ఆదాయం వచ్చిందని ఛత్తీస్‌ఘడ్ అంటుంటే కేసీఆర్ తెలంగాణకు ఎలా అన్యాయం చేశారు..? గతంలో యాదాద్రి విద్యుత్ కేంద్రం బంద్ చేయిస్తామన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి... రోషం ఉంటే ప్రారంభోత్సవానికి పోకూడదు. కోదండరాం చిన్న పదవి కోసం ఆశ పడి దొంగలకు మద్దతు పలుకుతున్నారు.



# బీహార్‌లో ప్రారంభోత్సవానికి ముందే కూలిపోయిన బ్రిడ్జి

## అరారియాలో రూ.12 కోట్ల రూపాయలతో వంతెన నిర్మాణం



**అరారియా:** బీహార్‌లో ప్రారంభోత్సవానికి ముందే ఓ బ్రిడ్జి కూలిపోయింది. బీహార్‌లోని అరారియాలో రూ.12 కోట్ల రూపాయలతో వంతెనను నిర్మించారు. అయితే వంతెన ప్రారంభోత్సవానికి ముందే కుప్పకూలిపోయింది. సిక్తి, కుర్సకాంత బ్లాక్‌లను కలుపుతూ బక్రా నదిపై రూ.12 కోట్ల రూపాయల వ్యయంతో వంతెనను నిర్మించారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి నష్టం జరగలేదు. ఇందుకు ఫొటోలు, వీడియోలు మాత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఏడాది మార్చిలో కూడా బీహార్‌లోని సుపాల్‌లో నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోవడంతో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. 10 మంది గాయపడ్డారు. కోసి నదిపై నిర్మిస్తున్న వంతెన స్లాబ్ కూలిపోవడంతో భేజా మరియు బకౌర్ మధ్య ఉన్న మరీచా దగ్గర ఈ ఘటన జరిగింది.

# వైద్య శాఖలో ప్రక్షాళన మొదలైంది

**ఒకటి రెండు ఏళ్లలో స్థిరమైన మార్పులు**

**ప్రతి 35 కిలోమీటరు కి ఒక ట్రామ సెంటర్**

**కొత్తగా 75 ట్రమా కేర్ సెంటర్లు ఏర్పాటు**

**ప్రభుత్వ ఆస్పత్రులకు డయగ్నోస్టిక్ సెంటర్ల అనుసంధానం**

**వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి**



**హైదరాబాద్:** వైద్య శాఖలో ప్రక్షాళన మొదలైందని, ఒకటి రెండు ఏళ్లలో స్థిరమైన మార్పులు కనిపిస్తాయన్నారు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ కిట్ లో మార్పులు.. ప్రతి 35 కిలోమీటరు కి ఒక ట్రామ సెంటర్, కొత్తగా 75 ట్రమా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డయగ్నోస్టిక్ సెంటర్లు ప్రభుత్వ ఆస్పత్రులకు లింక్ చేసే విధంగా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 3 రకాల టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేయబోతున్నామని, ప్రైవేటు ఆస్పత్రుల పర్యవేక్షణ ( క్లినికల్ ఎస్టాబ్లిష్ ) అని ఆయన వ్యాఖ్యానించారు. ఫార్మా మెడికల్ కోసం (డ్రగ్స్ నియంత్రణ ) ఫుడ్ క్వాలిటీ కోసమని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కోసం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రాంతాల వారీగా సర్వే చేయకుండా అవసరం లేకుండా ఇచ్చారని, మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లు కూడా దొరకని పరిస్థితి అని ఆయన అన్నారు. మెడికల్ ప్రొఫెషన్ స్లో గా పెరగాలన్నారు. కేసీఆరే డాక్టర్ అయ్యాడు%ో% కేసీఆరే ఇంజనీర్ అయ్యాడని ఆయన సెటైర్లు వేశారు. కరోనా కు పారాసిటామాల్ అన్నారు.. కాళేశ్వరం ఆయన్నే డిజైన్ చేశారన్నారు. హైదరాబాద్ లో 4 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల కోసం 9 వేల కోట్ల రూపాయలు లోన్ రూపంలో తీసేసుకున్నారని, 21 అంతస్తుల నుంచి 14 అంతస్తులకు తగ్గించామన్నారు దామోదర రాజనర్సింహ. వైద్య రంగంలో రెగ్యులేటరీ పవర్స్ అమలు చేద్దామన్నారు దామోదర రాజనర్సింహ. గత ప్రభుత్వ తీరుపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విమర్శలు తెలిపారు. సిద్దిపేట ఆస్పత్రిపై దృష్టి పెట్టీ.. ఉస్మానియా ఆస్పత్రిని పట్టించుకోలేదని, పదేళ్లు పాలించి కనీసం ఉస్మానియా ఆస్పత్రిని కొత్తగా కట్టలేదన్నారు. సిటికి పక్కనే ఉన్న మహేశ్వరంలో మెడికల్ కాలేజీ ఎందుకు ఇచ్చారో తెలియదన్నారు దామోదర రాజనర్సింహ. ఇంజనీరింగ్ కాలేజీల మాదిరిగా మెడికల్ కాలేజీలు కుప్పకూలిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు.

# పలు ఎయిర్‌పోర్టులకు బాంబు బెదిరింపులు

## భద్రత కట్టుదిట్టంచేసిన పోలీసులు



**న్యూఢిల్లీ:** దేశంలో మరోసారి బాంబు బెదిరింపు ఈ మెయిల్స్ కలకలం సృష్టించాయి. బీహార్‌లోని పాట్నా విమానాశ్రయ అధికారులకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్‌లు అందడంతో మంగళవారం ఎయిర్ పోర్ట్ పరిసరాల్లో భయాందోళన నెలకొంది. మంగళవారం మధ్యాహ్నం 1:10 గంటలకు పాట్నా విమానాశ్రయం డైరెక్టర్‌కు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. దీంతో ఎయిర్ పోర్టు అంతటా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పాట్నా ఎయిర్ పోర్ట్ డైరక్టర్ తెలిపారు. కాగా మంగళవారం ఇది రెండో బాంబు బెదిరింపు. అంతకుముందు గుజరాత్‌లోని వడోదరా విమానాశ్రయానికి బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. విమానాశ్రయ అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. పోలీసులను సంప్రదించి విమానాశ్రయ ఆవరణలో భద్రతను పెంచారు. బెదిరింపు ఈమెయిల్‌ను పంపిన వ్యక్తిని ట్రాక్ చేయడానికి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ఇక వడోదర సైబర్ క్రైమ్ బెదిరింపు ఈ-మెయిల్ మూలాన్ని వెతుకుతోంది. మంగళవారం, బూటకపు బాంబు బెదిరింపు చెన్నై నుంచి దుబాయ్ వెళ్లే విమానం ఆలస్యానికి కారణమైంది. ఈ విమానంలో 268 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానంలో బాంబు ఉన్నట్లు బెదిరింపు రావడంతో భద్రతా సంస్థలు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ఇదిలా ఉండగా సోమవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళు తున్న విమానానికి మరో బాంబు బెదిరింపు వచ్చింది. జూన్ 17 ఉదయం 9:35 గంటలకు, ఢిల్లీ- దుబాయ్ ఫ్లైట్‌లో బాంబు ఉందని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఆఫీసు ఎయిర్‌పోర్ట్‌కు ఈమెయిల్ వచ్చిందని పోలీసులు తెలిపారు. కోయంబత్తూరు, జైపూర్ ఎయిర్ పోర్టులకు కూడా బాంబు బెదిరింపు ఈమెయిల్స్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఎయిర్ పోర్టు పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు. గత వారం ఢిల్లీలోని పలు మ్యూజియంలకు బాంబు బెదిరింపులు వచ్చాయని పోలీసులు తెలిపారు. కాగా అదంతా ఫేక్ అని తేల్చేసారు అధికారులు. ఢిల్లీలోని రైల్వే మ్యూజియంతోపాటు దాదాపు 10-15 మ్యూజియంలకు ఈమెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# జిజిహెచ్ లో సూపర్ స్పెషాలిటి స్థాయిలో వైద్యం.

**ఇటీవల న్యూరో (నరాల) సేవలు ప్రారంభం.**

**కొత్తగా యూరోలాజి ( మూత్రపిండ సంబందిత) చికిత్సలు.**

**సూపరెంటెండెంట్ డాక్టర్ ప్రతిమా రాజ్ వెల్లడి.**









**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జూన్ 18:**

జిజిహెచ్ లో సూపర్ స్పెషాలిటి స్థాయిలో వైద్యం అందిస్తున్నారు. ఇటీవల న్యూరో (నరాల) సేవలు ప్రారంభం కాగా, కొత్తగా యూరోలాజి ( మూత్రపిండ సంబందిత) చికిత్సలు అందుబాటులో కి తెచ్చారు. ఈ మేరకు జిజిహెచ్ లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సూపరెంటెండెంట్ డాక్టర్ ప్రతిమా రాజ్ ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న నూతనంగా అందిస్తున్న వైద్య సేవల గురించి వివరించారు. ఆస్పత్రిలో ఇటీవల న్యూరో సర్జరీ సేవలు ప్రారంభించామని, ఇప్పుడు సూపర్ స్పెషాలిటీ సేవల లో బాగంగా యూరోలాజి సేవలను అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల జరిపిన నియామకాలలో జిజిహెచ్ కి యూరోలాజి విభాగానికి చెందినా డా. శబరినాథ్ రావడం, ఇలాంటి శస్త్ర చికిత్స లను చేయడం చాల సంతోషకరం అని తెలిపారు. జిజిహెచ్ లో ఈ వారంలో షైక్ జాని, రవి అనే ఇద్దరికీ మూత్రాశయం లో ఉన్న రాళ్ల ను శస్త్ర చికిత్స ద్వారా తొలగించడం జరిగిందని అన్నారు. ఈ శస్త్ర చికిత్సలను, డా. శబరినాథ్ యురోలోజి శస్త్ర చికిత్స నిపుణుల ఆధ్వర్యంలో జరిపించడం జరిగిందని తెలిపారు అంతే కాకుండా మూత్రపిండాలకు మిగతా చికిత్స లను కుడా అన్ని సమకూర్చుకొని త్వరలో చేస్తామని తెలిపారు. నిజామాబాదు వాస్తవ్యులు ఎవరైనా మూత్రాశయం లో రాళ్ల తో ఇబ్బంది పడుతున్నట్లయితే జిజి హెచ్ లో సంప్రదిచాగలరని సూచించారు.

ఈ శస్త్ర చికిత్స చేయించుకున్న ఇద్దరు పేషెంట్లు ఆసుపత్రికి వచ్చి ఇక్కడ సేవలు బాగున్నాయని,
ఈ శస్త్ర చికిత్సలకు ప్రైవేటు ఆసుపత్రి లో సుమారు 1 లక్ష రూపాయల ఖర్చు తో కూడుకున్న వైద్యాన్ని మాకు ఇక్కడ ఉచితంగా నిర్వహించిన సూపరింటెండెంట్ కు, ఇతర వైద్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో పురోగతి



## సిట్ బృందానికి కీలక హార్ట్ డిస్కులు లభ్యం


**హైదరాబాద్:** తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసు దర్యాప్తులో సంచలన ఆధారాలు బయటకొస్తున్నాయి. ఇప్పటికే పలు ఆధారాలు సేకరించిన సిట్ బృందానికి మరో కీలక హార్ట్ డిస్కులు లభించాయి. ఎస్ఐబీకి టెక్నాలజీ అందించిన ఇన్నోవేషన్ ల్యాబ్‌లో హార్డ్ డిస్కులు సీజ్ చేశారు. ఇందులో మూడు సర్వర్లు, ఐదు మినీ డివైసస్‌తో పాటు హార్డ్ డిస్కులను సిట్ స్వాధీనం చేసుకుంది. ఇన్నోవేషన్ ల్యాబ్ చైర్మన్ రవికుమార్ ఇంటితోపాటు కార్యాలయంలో సిట్ సోదాలు నిర్వహించింది. దీంతోపాటు బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో సైతం సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో ల్యాబ్ ప్రతినిధులు స్టేట్ మెంట్‌లను కూడా సిట్ రికార్డు చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా రవికుమార్ ఇంట్లో దాచి పెట్టిన హార్డ్ డిస్కులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రణీత్ రావు.. ఇన్నోవేషన్ ల్యాబ్ సహకారం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా, ఆ సంస్థ చైర్మన్ రవికుమార్ ఇంట్లో లభ్యమైన హార్డ్ డిస్కులు కేసు దర్యాప్తును మలుపు తిప్పుతాయా? అనే ఉత్కంఠ అందిరిలోనూ నెలకొంది. కాగా, ప్రతిపక్ష నేతల ఇళ్లతోపాటు మూడు జిల్లాలో ల్యాబ్ మినీ కంట్రోల్ రూమ్ ఏర్పాటులో రవికుమార్ కీలక పాత్ర పోషించినట్లు సిట్ నిర్ధారించుకుంది. అయితే రవికుమార్‌ను విచారిస్తారా? నోటీసులు జారీ చేశారా? అనే విషయంపై క్లారిటీ రావాల్సి ఉంది.

# బీసీ కుల జనగణన చేపట్టాలి..

## - బహుజన కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి కె పర్వతాలు.

**వేగుచుక్క న్యూస్, యాదాద్రి భువనగిరి, జూన్ 18:**





రాష్ట్రంలో కుల జనగణన చేపట్టిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని, బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో మంగళవారం బీఎల్ ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది.. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి , బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కె ,పర్వతాలు హాజరై, మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కుల జనగణన ప్రారంభించాలని డిమాండ్ చేశారు .లేదంటే బీసీలను ఏకం చేసి ఎస్సీ ఎస్టీలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారుఈ రౌండ్ టేబుల్ సమావేశంకు బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ నూనె వెంకటస్వామి అధ్యక్షత వహించగా, నాయకులు పూస శీను, రాందేవ్ యాదవ్, కదారి వెంకటేష్, ఎర్ర జాన్సన్, మరిపెల్లి శ్రీనివాస్, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.

# పవిత్ర గౌడకి తీవ్ర అస్వస్థత..

బెంగళూరు: రేణుకా స్వామి హత్య కేసులో అరెస్టయిన నటుడు దర్శన్ ప్రియురాలు పవిత్ర గౌడ తీవ్ర అస్వస్థతకు గురై బెంగళూరులోని ఆసుపత్రిలో చేరారు. హత్య కేసులో ఏ1గా ఉన్న పవిత్ర గౌడ వారం రోజులకు పైగా పోలీసుల కస్టడీలో ఉన్నారు. ప్రతిరోజూ ఉదయం పోలీస్ స్టేషన్‌లో విచారణ అనంతరం నిమ్హాన్స్‌లోని మహిళా సౌకర్యాల కేంద్రంలో ఆమెను ఉంచుతున్నారు. ఆదివారం రోజంతా ఆర్ఆర్ నగర్ ఇంటి వద్ద పోలీసులు విచారణ నిర్వహించగా, అనంతరం పవిత్ర అలసిపోయింది. ఇక మంగళవారం ఉదయం పవిత్ర గౌడ తనకు బాలేదని చెప్పడంతో చికిత్స నిమిత్తం బెంగళూరులోని ప్రభుత్వాసుపత్రిలో చేరారు.జూన్ 8న రేణుకాస్వామి హత్యకు గురికాగా, జూన్ 10న (సోమవారం) నటుడు దర్శన్, అతని ప్రియురాలు పవిత్ర గౌడను అరెస్టు చేశారు. ఆమె వరుసగా 9 రోజులు పోలీసు కస్టడీలో ఉన్నారు. అన్నపూర్ణేశ్వరి నగర్ లోని పోలీస్ స్టేషన్ సెల్‌లో దర్శన్‌తో పాటు ఇతర నిందితులందరినీ పోలీసులు విచారిస్తున్నారు. మహిళా నిందితురాలు పవిత్రను మాత్రమే మహిళా సాంత్వన కేంద్రంలో ఉంచారు. ఇక మరోపక్క దర్శన్ ఫాంహౌస్ మేనేజర్ శ్రీధర్ (39 ఏళ్లు) ఏప్రిల్ 16న ఆత్మహత్య చేసుకున్నాడు. బెంగళూరులోని అనేకల్ సమీపంలోని దర్శన్ ఖఫామ్‌హౌస్ పక్కన బండరాళ్ల మధ్య శ్రీధర్ మృతదేహం లభ్యమైంది. శ్రీధర్ విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేసు ఇంకా విచారణలో ఉంది.

# జమ్మూకశ్మీర్‌లోని పూంచ్‌లో ఎన్‌కౌంటర్

పూంచ్,జూన్18(ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో భద్రతా బలగాలు-ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరుగుతున్నట్లు సమాచారం అందుతుంది. ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసుల బృందంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపినట్లు సమాచారం. దీంతో.. వెంటనే అదనపు బలగాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. పూంచ్ ప్రాంతంలో ఇద్దరు టెర్రరిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో ఆ ప్రాంతానికి అదనపు బలగాలను పంపించామని.. ఉగ్రవాదులు భద్రతా బలగాలపై కాల్పులు జరిపారని అధికారులు చెబుతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో జమ్మూ కాశ్మీర్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ బృందంపై కాల్పులు జరిపినట్లు సోర్సెస్ చెబుతున్నాయి.




**నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించడంతోపాటు పరీక్ష మళ్లీ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది.**

**విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**

# నీట్ రద్దు చేసి.. మళ్లీ నిర్వహించాలి

**హిమాయత్‌నగర్:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించడంతోపాటు పరీక్ష మళ్లీ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. జరిగిన తప్పిదానికి ప్రధాని నరేంద్రమోదీ బాధ్యత వహించాలని, దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరింది. కమిటీ (విద్యార్థి సంఘాలైన ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పీవైసీ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, వీజేఎస్, పీవైఎల్, వైజేఎస్) ఆధ్వర్యంలో మంగళవారం హిమాయత్‌నగర్ వై.జంక్షన్ నుంచి వందల మంది విద్యార్థులతో లిబర్టీ మీదుగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా 24 లక్షల మంది విద్యార్థుల భవిత గందరగోళంలో పడిందన్నారు. దీనికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్పందించేందుకు ప్రధానికి 14 రోజుల గడువిచ్చినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం దిగిరాకపోతే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను రాష్ట్రంలో అడ్డుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే ఐకాసతో చర్చించి భవిష్యత్ ప్రణాళికను ప్రకటిస్తామన్నారు. నిరసన ప్రదర్శనలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చందనారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అభిజిత్, ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పుట్ట లక్ష్మణ్, మణికంఠరెడ్డి, ఇతర విద్యార్థి సంఘాల ప్రతినిధులు నాగరాజు, మూర్తి, మహేష్, ఆజాద్, రామకృష్ణ, వెంకటేష్, ధర్మేంద్ర, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.




# దేవరలో ఆసక్తికర యాక్షన్ సీన్స్

'దేవర'గా థియేటర్లలో యాక్షన్ హంగామా చూపించనున్నారు ఎన్టీఆర్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని కొరటాల శివ తెరకెక్కిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జాన్వీ కపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ముగింపు దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర అప్‌డేట్‌ను ఛాయాగ్రాహకుడు రత్నవేలు సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకున్నారు. ఎన్టీఆర్, సైఫ్‌లపై గోవా అడవుల్లో ఓ ఆసక్తికర యాక్షన్ సీక్వెన్స్‌ను పూర్తి చేసినట్లు తెలిపారు. దీనికి స్టంట్ మాస్టర్ పీటర్ హెయిన్స్ నేతృత్వం వహించారు. భారీ వర్షాలతో ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ తారక్, సైఫ్‌లతో పాటు మిగిలిన చిత్ర బృందం సహకారంతో్ ÷ట్‌ను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం తదుపరి షెడ్యూల్ థాయ్‌లాండ్‌లోని క్రాబీ దీవుల్లో ప్రారంభించేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అక్కడ ఎన్టీఆర్, జాన్వీలపై ఓ రొమాంటిక్ గీతాన్ని చిత్రీకరించనున్నారు. దీనికోసం వాళ్లిద్దరూ ఇప్పటికే అక్కడికి పయనమయ్యారు.






# ఫేక్ అకౌంట్లతో జాగ్రత్త హెచ్చరించిన జాన్వీ కపూర్

బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఫొటోలు, సినిమాల విశేషాలు పంచు కుంటారు. తాజాగా ఆమె పేరుతో ఉన్న ఓ ఎక్స్ అకౌంట్‌లో అసభ్యకరమైన పోస్ట్‌లు దర్శనమిచ్చాయి. దీంతో ఈ ఖాతాలపై టీమ్ క్లారిటీ ఇచ్చింది. 'డిజిటల్ ప్రపంచంలో ఎవరి పేరుతోనైనా అకౌంట్ క్రియేట్ చేయడం సులభంగా మారింది. జాన్వీకపూర్‌కు అధికారిక ఎక్స్ (ట్విటర్) ఖాతా లేదని మరోసారి స్పష్టం చేస్తున్నాం. దయచేసి ఈ ఫేక్ అకౌంట్‌లను ప్రోత్సహించకండి. వాటిని ఫాలో కావొద్దు. వీటిలో పోస్ట్ చేసే సమాచారాన్ని నమ్మొద్దు. మీ అందరి సహకారానికి ధన్యవాదాలు' అని అప్రమత్తంగా ఉండాలని టీమ్ కోరింది. ఆమె పేరుతో ఎక్స్‌లో ఉన్న నకిలీ ఖాతాల వివరాలను పేర్కొంది. జాన్వీ ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉండడం కోసం కేవలం ఇన్‌స్టానే వాడతారని టీమ్ పేర్కొంది. ప్రస్తుతం ఈ బ్యూటీకి ఇన్‌స్టాలో 24 మిలియన్ల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఇటీవల 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్స్‌లో జాన్వీ మాట్లాడుతూ.. సోషల్ మీడియా అంటే తనకు భయమని తెలిపారు. ప్రముఖ సోషల్ మీడియా వెబ్‌సైట్ రెడిట్ ను తనకంటే తన చెల్లి ఖుషీనే ఎక్కువగా వాడుతుందని చెప్పారు. ఇందులో విశేషాలు చెల్లిని అడిగి తెలుసు కుంటానని ఆమె వెల్లడించారు. ఇటీవలే ఈ చిత్రంతో విజయాన్ని అందుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం తెలుగులో రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్ సరసన నటిస్తున్నారు.



# పాయల్.. ఇంతకంటే ఘాటైన లుక్

గ్లామరస్ బ్యూటీగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్న వారిలో పాయల్ రాజ్ పూత్ కూడా టాప్ లిస్టులో ఉంటుంది అని చెప్పవచ్చు. ఈ బ్యూటీ ఎలాంటి సినిమా చేసినా కూడా అందులో తన గ్లామర్ తోనే ఎక్కువగా ఎట్రాక్ట్ చేస్తూ ఉంటుంది. ముఖ్యంగా ఆమె నటించిన ఆర్ఎక్స్ 100 సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అందులో పాయల్ రాజ్ పుత్ కనిపించిన విధానం కుర్రాళ్ళ మనసును గట్టిగానే దోచేసింది. ఇక తర్వాత సినిమాలలో కూడా ఆమె కాస్త గ్లామర్ డోస్ పెంచి ఆశ్చర్యాన్ని కలిగించింది. ముఖ్యంగా మంగళవారం సినిమాతో కూడా స్టన్ అయ్యేలా దర్శనమిచ్చింది. ఆ సినిమాలో కూడా బోల్డ్ సీన్స్ ఎంతగానో అట్రాక్ట్ చేసింది. అలాగే నటిగా కూడా ఆమె మంచి మార్కులు అందుకుంది అని చెప్పాలి. ఇలాంటి బోల్డ్ క్యారెక్టర్స్ కు పాయల్ రాజ్ పుత్ బెస్ట్ ఆప్షన్ అనే విధంగా ఆమె తన టాలెంట్ చూపించింది. ఇక సోషల్ మీడియాలో కూడా పాయల్ ఎప్పటికప్పుడు తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తుంది. రీసెంట్ గా ఆమె పోస్ట్ చేసిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. పాయల్ బటన్స్ లేని సూట్ లో గతంలో ఎప్పుడూ లేనంత ఘాటుగా దర్శనమిచ్చింది. గతంలో బికినీలో కూడా కనిపించిన అమ్మడు ఈ లుక్ లో మాత్రం చాలా అందంగా ఉంది అంటూ ఫాలోవర్స్ చాలా పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. అయితే ఈ తరహా గ్లామర్ డోస్ ఎంత పెంచిన కూడా ఆమెకు అగ్ర హీరోలతో అవకాశాలు మాత్రం రావడం లేదు. చిన్న తరహా సినిమాల్లో ఎక్కువగా అవకాశాలు వస్తున్నాయి. అది కూడా లేడీ ఓరియంటెడ్ ప్రాజెక్టులలో ఎక్కువగా నటిస్తోంది. ఇక మంచి కంటెంట్ ఉన్న బిగ్ సినిమాలలో ఆమె అవకాశం అందుకోవాలని అనుకుంటుంది. రీసెంట్ గా మరొక లేడీ ఓరియంటెడ్ సినిమాతో కూడా ప్రేక్షకుల ముందుకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ సినిమా అంతగా సక్సెస్ కాలేదు. నిర్మాతతో కాస్త విభేదాలు వచ్చినప్పటికీ చివరికి మళ్ళీ ఆమె చాలా కూల్ గానే రియాక్ట్ అయింది. ఇక ప్రస్తుతం ఆమె మరో రెండు ప్రాజెక్టులు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అందులో ఒకటి సుహాస్ తో నటించబోతున్నట్లుగా గాసిప్స్ అయితే పుట్టుకొస్తున్నాయి. అలాగే మరో లేడీ ప్రాజెక్టు చేయడానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. త్వరలోనే ఈ విషయంపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మరి తన గ్లామర్ తో అమ్మడు ఇండస్ట్రీలో ఇంకా ఎలాంటి గుర్తింపు అందుకుంటుందో చూడాలి.

# పుష్ప 2.. ఆమెకు పెద్ద తలనొప్పి!



కన్నడ బ్యూటీ రష్మిక మందన్న.. పుష్ప మూవీతో పాన్ ఇండియా లెవెల్ లో క్రేజ్ సంపాదించుకున్న విషయం తెలిసిందే. శ్రీవల్లిగా అందరినీ మెప్పించి వేరే లెవెల్ లో పాపులారిటీ దక్కించుకుంది. నేషనల్ క్రష్ గా మారిపోయింది. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుని నార్త్ టు సౌత్ అనేక సినిమాలు చేస్తూ దూసుకుపోతోంది. తనదైన అందం, అభినయంతో అలరిస్తోంది. నాన్ స్టాప్ గా షూటింగ్స్ లో పాల్గొంటోంది అమ్మడు. ఇక ప్రస్తుతం ఆమె పుష్ప-2లో శ్రీవల్లి 2.0గా నటిస్తోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన ఆమె ఫస్ట్ లుక్ తోపాటు సూసేకి సాంగ్ మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. ఇంతలో సినిమా రిలీజ్ ను వాయిదా వేస్తూ మేకర్స్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. ఇంకా షూటింగ్ పూర్తవ్వకపోవడమే పోస్ట్ పోన్ కు కారణమని మేకర్స్ తెలిపారు. మంచి క్వాలిటీతో ఔట్ పుట్ ఇవ్వడమే తమ టార్గెట్ అని చెప్పారు. బన్నీ స్పెషల్ పోస్టర్ ను షేర్ చేశారు. డిసెంబర్ 6వ తేదీన సినిమాను రిలీజ్ చేయనున్నట్లు కూడా వెల్లడించారు. అయితే అదే ఇప్పుడు రష్మికకు పెద్ద తలనొప్పిగా మారింది. ఎందుకంటే బాలీవుడ్ లో విక్కీ కౌశల్ తో కలిసి ఆమె చేస్తున్న చావా మూవీ అదే డేట్ న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. దీంతో నేషనల్ క్రష్.. పుష్ప పోస్ట్ పోన్ విషయం పట్ల డిస్సపాయింట్ అయినట్లు తెలుస్తోంది. చావా మూవీ కూడా ఇప్పుడు వాయిదా పడుతుందని అంటున్నారు. బ్లాక్ బస్టర్ హిట్ మూవీలు తీసిన లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న చావా మూవీ.. ఛత్రపతి శివాజీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతోంది. మహారాష్ట్రలో శివాజీకి స్పెషల్ అభిమానులు ఉన్నారు. దీంతో ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. అందుకే పుష్ప, చావా ఒకేసారి విడుదలైతే.. బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద పెద్ద క్లాష్ జరుగుతోంది. రెండు సినిమాల వసూళ్లపై కూడా ఎఫెక్ట్ పడుతుంది. కాబట్టి క్లాష్ జరగడం మంచిది కాదు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న పుష్ప-2 మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.1000 కోట్ల సాధించే లక్ష్యంగా రిలీజ్ అవుతుంది. కాబట్టి చావా విడుదల విషయంలో మేకర్స్ దే తుది నిర్ణయం. బాక్సాఫీస్ వద్ద పుష్ప 2తో నేరుగా పోటీ పడడం కన్నా పోస్ట్ పోన్ చేయడమే బెటర్ అని సినీ పండితులు చెబుతున్నారు. వచ్చే ఏడాది జనవరిలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా రిలీజ్ చేస్తే అన్నీ కలిసి వస్తాయని అంటున్నారు. మరేం జరుగుతుందో వేచి చూడాలి.

# పారితోషికంలో
## తగ్గేదే లేదంటున్న ఫాజిల్



మలయాళం సూపర్ స్టార్ ఫహాద్ ఫాజిల్ 'పుష్ప 2' లో ఒక కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకి ముందు 'పుష్ప' లో ఫహాద్ ఫాజిల్ కనిపించారు, ఇప్పుడు ఈ సీక్వెల్ లో అతని పాత్ర నిడివి ఇంకా ఎక్కువ ఉంటుంది అన్న విషయం తెలిసిందే. ఈ సినిమా ఆగస్టు 15 న విడుదల కావాల్సి వుంది, కానీ ఇప్పుడు డిసెంబర్ 6 కి వాయిదా పడింది. అయితే ఇంత దూరం వాయిదా పడటంతో అయితే ఇంత దూరం వాయిదా పడటంతో అల్లు అర్జున్ అభిమానులు కొంచెం అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఇక ఈ సినిమాలో ఫహాద్ ఫాజిల్ విషయానికి వస్తే అతను మలయాళంలో చేసిన సినిమా 'ఆవేశం' చాలా పెద్ద విజ్జయం సాధించటమే కాకుండా, వంద కోట్ల క్లబ్బులోకి చేరింది కూడా. మలయాళం పరిశ్రమలో ఫహాద్ ఫాజిల్ ఇప్పుడు పెద్ద సూపర్ స్టార్ అయిపోయారు. మరి అటువంటి సూపర్ స్టార్ తెలుగు సినిమా 'పుష్ప 2' కి తీసుకుంటున్న పారితోషికం ఎంతో తెలిస్తే షాకవుతారు. ఫహాద్ ఫాజిల్ ఈ సినిమా కోసం రోజువారీ పారితోషికం తీసుకుంటారని తెలుస్తోంది. అతను రోజుకి రూ.12.50 లక్షలు పారితోషికం తీసుకుంటారని సమాచారం. ఈ షెడ్యూల్ లో సుమారు నెల రోజులపాటు తన తేదీలను ఈ సినిమా కోసం కేటాయించారు ఫహాద్ ఫాజిల్. ఇంతకు ముందు కూడా చాలా రోజులు ఈ సినిమా కోసం కేటాయించారు. గత రెండు సంవత్సరాల నుండి ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది, కానీ ఇంకా పూర్తి కాలేదు.



# మిస్టర్ బచ్చన్‌గా
## అలరించనున్న రవితేజ

'మిస్టర్ బచ్చన్'గా సినీప్రియుల్ని పలకరించనున్నారు రవితేజ. ఆయన హీరోగా నటిస్తున్న ఈ సినిమాని హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. జగపతిబాబు ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం నుంచి షో రీల్ పేరుతో ఓ వీడియో గ్లింప్స్ విడుదల చేశారు. దాదాపు నిమిషం నిడివి ఉన్న ఈ ప్రచార చిత్రంలో ఒక్క డైలాగ్ లేకున్నా.. రవితేజ ఆద్యంతం మాస్ యాక్షన్ హంగామాతో అలరించారు. ఆయన ఇందులో నిజాయతీ గల ఆదాయపన్ను అధికారిగా కనిపించనున్నట్లు అర్థమవుతోంది. తను ఓ రాజకీయ నాయకుడి ఇంటికి రైడ్‌కు వెళ్లాక ఏం జరిగిందనే ఆసక్తికర అంశంతో ఈ సినిమా రూపొందించినట్లు తెలుస్తోంది. ఆఖర్లో అమితాబ్ కటౌట్ ముందు ఆయన్ని అనుకరిస్తూ రవితేజ కనిపించిన తీరు ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు ముగింపు దశలో ఉన్నాయి. త్వరలోనే విడుదల తేదీ ప్రకటించనున్నారు. ఈ సినిమాకి సంగీతం: మిక్కీ జె.మేయర్, ఛాయాగ్రహణం: అయనంక బోస్.



# కుటుంబకథా చిత్రాలే ఇష్టం: కియారా

కుటుంబంతో కలిసి చూసే సినిమాల్లో నటించడమే నా లక్ష్యం అని అంటోంది బాలీవుడ్ భామ కియారా అడ్వాణీ. 'ఫగ్లీ'తో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన ఈ అందాల తార.. తన నటనతో తెలుగు ప్రేక్షకులనూ మెప్పించింది. త్వరలో 'గేమ్‌ఛేంజర్'తో రావడానికి సిద్ధమవుతున్న కియార.. హిందీ పరిశ్రమలో పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా తన అనుభవాలను పంచుకుంటూ ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. 'నటిగా ఎదగాలనే లక్ష్యంతో నాకు 21ఏళ్లు ఉన్నప్పుడు సినీ కెరీర్‌ను ప్రారంభించాను. అప్పుడు నేనేం చేస్తున్నానో.. ప్రేక్షకులకు ఎలా దగ్గరవ్వాలో కూడా తెలియదు. ఎలాంటి సినిమాలు ఎంచుకోవాలో అవగాహన లేదు. కానీ నా పదేళ్ల ప్రయాణంలో జీవితంలో ఎలా పైకి ఎదగాలో నేర్చుకున్నాను. పాత్రలు, కథల ఎంపికలో మార్పులు చేస్తూ.. కుటుంబంతో కలిసి చూసేలా సినిమాలు తీయాలని నిర్ణయించు కున్నాను. ఇప్పుడిదే నా లక్ష్యం. ఈ ప్రయాణంలో ఎన్నో మరువలేని జ్ఞాపకాలను పోగుచేసుకున్నాను. ఇప్పటికీ రోజూ కొత్తగానే అనిపిస్తుంటుంది. ప్రేమ, కలలు, చిరునవ్వులు, కన్నీళ్లు.. ఇలా ఎన్నో అనుభవాలను ఎదుర్కొన్నాను.